సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 21 । డిసెంబర్ । 2023



మన్యం గజగజ
మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతు న్నాయి. చలిగాలులు విజృంభిస్తున్నాయి. మంచు దట్టంగా కురుస్తోంది. 10లో



కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు
విశాఖ మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఘనంగా తిరువీధి
సింహాచలం: సింహగిరిపై ధనుర్మాస పూజల్లో భాగంగా గోదాదేవికి బేడామండ పంలో తిరువీధి వైభవంగా నిర్వహించారు.

విద్యా వికాసం

గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. అక్షరాస్యతా శాతం ఎక్కువగా ఉన్న మైదాన ప్రాంతాలతో గిరిజన విద్యార్థులు పోటీపడే లక్ష్యంతో విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా డిజిటల్ బోధనతో వారి ప్రగతికి బాటలు వేస్తోంది. ఉత్తమ ప్రమాణాలతో విద్యను అందించడంతో నేడు గిరిజన విద్యార్థులు సివిల్స్‌లో సైతం సత్తా చాటుతున్నారు.

- విప్లవాత్మక సంస్కరణలతో సత్ఫలితాలు
- పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు
- అందుబాటులోకి డిజిటల్ విద్య
- మంచి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రభుత్వం



పాడేరు తలారిసింగి పాఠశాలలో డిజిటల్ విధానంలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

సాక్షి, పాడేరు : ఒకప్పుడు అక్షరాస్యతలోనే కాదు అన్నివిధాలా ఈ ప్రాంతం వెనుకబడి ఉండేది. విద్య, వైద్య రంగాలు అందనంత దూరంలో ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన ప్రాంతాలతో అల్లూరి సీతారామరాజు జిల్లాగా ఏర్పాటుచేసింది. పాలనా వ్యవస్థను ప్రజలకు చేరువ చేసింది. సచివాలయాల ఏర్పాటుతో సంక్షేమం ఇంటికి చేరువైంది. విద్యా ప్రమాణాల మెరుగుకు అవసరమైన చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా నాడు–నేడు పథకంలో పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించింది. మొదటి విడతలో 578 పాఠశాలలను అభివృద్ధి చేసింది. రెండవ విడతలో 947 పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. పాడేరులో వైద్య కళాశాల ఏర్పాటుతో మిగతా 10వ పేజీలో ▶

ట్యాబ్‌లతో నాణ్యమైన బోధన



నాణ్యమైన విద్యాబోధనను ట్యాబ్‌ల ద్వారా అందిస్తున్నారు. హిందీ మినహా అన్ని పాఠ్యాంశాల సమాచారం ట్యాబ్‌లలో పొందుపరిచారు. ఉపాధ్యాయులు వీటి ద్వారా బోధిస్తున్నారు. గత ఏడాది ఎనిమిదో తరగతిలో ప్రభుత్వం ట్యాబ్‌ను అందజేసింది. తొమ్మిదో తరగతిలో కూడా అదే వినియోగిస్తున్నా. ఇంత ఖరీదైన ట్యాబ్‌ను తల్లిదండ్రులు కొనలేని పరిస్థితి.ప్రభుత్వం ఉచితంగా అందజేయడం సంతోషించదగ్గ విషయం. – పాడి అరుణ్‌ప్రసాద్, 9వ తరగతి విద్యార్థి, తలారిసింగి ఆశ్రమ పాఠశాల, పాడేరు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
నేడు చింతపల్లి రాక



సభా ప్రాంగణం

- ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- డిగ్రీ కళాశాల మైదానంలో బహిరంగ సభ

సాక్షి, పాడేరు: గిరిజన హృదయ విజేత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం చింతపల్లిలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. వీటిని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పర్యవేక్షించారు.

● సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజున చింతపల్లి రావడం ప్రత్యేకత సంతరించుకుంది. ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికేందుకు గిరిజనం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

● చింతపల్లికి సమీపంలోని చౌడుపల్లి వద్ద రోడ్లు భవనాలశాఖ అధికారులు హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. సీఎం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆశాఖ ఉన్నతాధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సభ జరిగే డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు పది వేల మందికి సరిపడేలా కుర్చీలతో సభావేదికను సిద్ధం చేశారు.



డిగ్రీ కళాశాల మైదానంలో సిద్ధం చేసిన బహిరంగ సభావేదిక

● ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో చింతపల్లి వస్తున్నందున అధికారులు బుధవారం ఉదయం ఏరియల్ సర్వే నిర్వహించారు.

పర్యటన ఇలా..

● ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10.30 గంటలకు హెలికాప్టర్‌లో చౌడుపల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో చింతపల్లి వెళతారు. ముందుగా అదే ప్రాంతంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారు. విద్యార్థులతో మాట్లాడతారు. అనంతరం 8వతరగతి మిగతా 10వ పేజీలో ▶

గిరి మురిసిన బిడ్డగా..

- నాడు ప్రతిపక్ష నేతగా.. నేడు ముఖ్యమంత్రిగా..
- రెండోసారి చింతపల్లి వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- అప్పట్లో బాక్సైట్ వ్యతిరేక ఉద్యమం సందర్భంగా రాక
- అధికారంలోకి వచ్చిన వెంటనే బాక్సైట్ జీవోల రద్దు

సాక్షి, పాడేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవసారి చింతపల్లిని సందర్శిస్తున్నారు. 2015లో చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన బాక్సైట్ జీవో 97ను వ్యతిరేకిస్తూ గిరిజనులంతా ఉద్యమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ అధినేతగా, ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి బాక్సైట్ జీవోను వ్యతిరేకించారు. గిరిజనుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు 2015 డిసెంబర్ 10వతేదీన చింతపల్లిలో బాక్సైట్ వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బాక్సైట్ జీవోలన్నింటిని రద్దు చేస్తానని అదే రోజు ఉద్యమ సభలో మిగతా 10వ పేజీలో ▶

మన్యం గజగజ

సాక్షి,పాడేరు: జిల్లా ప్రజలను చలి వణికిస్తోంది. చలితో పాటు పొగమంచు తీవ్రతకు ఏజెన్సీ ప్రజలు గజగజ వణికిపోతున్నారు. బుధవారం ఉదయం 10గంటల దాటినా మంచు తెరలు వీడలేదు. చలిగాలుల విజృంభించాయి. ఉదయం10.30 గంటలు దాటిన తరువాత సూర్యోదయం అయ్యింది.అలాగే పాడేరు మండలం మినుములూరులో 11డిగ్రీలు, అరకులోయ, చింతపల్లిలో 12డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.సాయంత్రం చలిగాలులు విజృంభించాయి.

జగన్ నాయకత్వంతోనే అభివృద్ధి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంతోనే అభివృద్ధి సాధ్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పేర్కొన్నారు. మండలంలోని వేములకొండ సచివాలయం పరిధిలోని ధారగూడెం, సోకులగూడెం గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అందించిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటనే మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో పెండింగ్ పనులు, ప్రజల వ్యక్తిగత, సామాజిక సమస్యలను తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేడు చింతపల్లి రాక

▶9వ పేజీ తరువాయి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారు. అక్కడ నుంచి డిగ్రీ కళాశాల మైదానంలోని సభకు సీఎం వెళతారు. సభ ముగిసిన అనంతరం ఆయన చౌడుపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ కొద్ది సేపు వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడతారు.అనంతరం హెలికాప్టర్‌లో విశాఖ బయలుదేరుతారు.

భారీగా పోలీసు బందోబస్తు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతో చింతపల్లితో పాటు సమీప ప్రాంతాలలో పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.బాంబు,డాగ్ స్క్వాడ్‌లతో గత రెండు రోజుల నుంచి పోలీసు బలగాలు తనిఖీలను ముమ్మరం చేశాయి. ఎస్పీ తుహిన్‌సిన్హాతో పాటు చింతపల్లి, పాడేరు ఏఎస్పీలు పోలీసు భద్రత చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

విస్తృత ప్రచారం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చింతపల్లి పర్యటన విజయవంతం చేయాలని కోరుతూ పాడేరు,అరకులోయ నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సభకు భారీగా తరలిరావాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఇప్పటికే పార్టీ శ్రేణులు, అభిమానులను సమాయత్తం చేశారు.



చౌడుపల్లిలో సిద్ధం చేసిన హెలిప్యాడ్



తనిఖీలు నిర్వహిస్తున్న బాంబ్ స్క్వాడ్



చింతపల్లి రోడ్డులో స్వాగత ఫ్లెక్సీలు

విద్యా వికాసం

▶9వ పేజీ తరువాయి వచ్చే ఏడాది నుంచి వైద్య విద్య అందుబాటులోకి రానుంది.

చదువుకు పేదరికం ఆటంకం లేకుండా..

జిల్లాలో వివిధ యాజమాన్యాల పరిధిలో 2,981 పాఠశాలల పరిధిలో 1,73,897 మందివిద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన తరువాత అమ్మ ఒడి పథకంలో 1,01,170 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.151కోట్ల75లక్షల50 వేలను జమచేసింది.

- జిల్లాలోని 23 మండలాల పరిధిలో 1,62,123 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది.
- జిల్లాలో టెన్త్‌లో పాఠశాల, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల సాధించిన 750 మంది విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకంలో రూ.19.84 లక్షల మేర నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం పంపిణీ చేసింది.
- గిరిజన విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందించే లక్ష్యంతో డిజిటల్ బోధనను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో 8వతరగతి చదువుతున్న 13,848 మంది విద్యార్థులకు, వారికి బోధించే 1159 మంది ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేసింది. గత విద్యాసంవత్సరంలో ట్యాబ్‌లు పొందిన విద్యార్థులందరికి బైజూస్ సంస్థ బోధన అందిస్తోంది.
- పాఠశాలల తరగతి గదులలో బ్లాక్‌బోర్డుల స్థానంలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐపీఎఫ్)లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. 154 పాఠశాలల్లో ఐపీఎఫ్‌లు, మరో 724 పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను అందుబాటులోకి తెచ్చింది.
- ఈఏడాది కూడా జిల్లాలోని 8వ తరగతి విద్యార్థులు 14,141 మందికి ట్యాబ్‌లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం చింతపల్లిలో పంపిణీ చేయనున్నారు.



నాడు-నేడు పథకంలో అభివృద్ధి చెందిన కిండంగి ప్రాథమికోన్నత పాఠశాల



అనంతగిరి ఆశ్రమ పాఠశాలలో ఐపీఎఫ్ బోర్డులో పాఠాల బోధన

సుగంధ ద్రవ్యాల మార్కెటింగ్‌కు సహకారం

- రైతులు, కొనుగోలుదారుల మధ్య వారధిగా ఐటీడీఏ
- పాడేరు పీవో అభిషేక్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

చింతపల్లిరూరల్: సుగంధ ద్రవ్య పంటల మార్కెటింగ్‌కు ఐటీడీఏ ప్రత్యేక సహకారం అందిస్తుందని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. బుధవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఎన్‌జీవోలు, ఎఫ్‌పీవోల కొనుగోలుదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల ఆర్థికాభివృద్ధికి ఐటీడీఏ ప్రత్యేక సహకారం అందిస్తుందన్నారు. పసుపు, మిరియం, అల్లం తదితర సుగంధ ద్రవ్యాలు రైతులు పండించినప్పటికి మంచి ధర పొందలేకపోతున్నారన్నారు. వారికి ఎన్‌జీవోలు, ఎఫ్‌పీవోల సహకారంతో రైతులకు మంచి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు బయట మార్కెట్‌పై అవగాహన లేనందున స్థానిక వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయించి నష్టపోతున్నారన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రైతులు, ఎన్‌జీవోలు, ఎఫ్‌పీవోలు, కొనుగోలుదారుల మధ్య ఐటీడీఏ వారధిగా నిలుస్తుందన్నారు. తద్వారా రైతులకు మంచి ధరలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. రైతులకు ఒక్క ప్లాట్‌ఫాం ఏర్పరచి వేలం రూపంలో విక్రియంచేలా ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ సదస్సులో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సురేష్ కుమార్, స్పైసెస్ బోర్డ్ సీనియర్ ఫీల్డ్ అధికారి కల్యాణి, డీ.డీ కాఫీ బోర్డు రమేష్, అల్లూరి జిల్లా మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్, ఉద్యానవన పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శివకుమార్ పాల్గొన్నారు.

గిరి మురిసిన బిడ్డగా..

▶9వ పేజీ తరువాయి

గిరిజనులకు జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ 2019లో అధికారంలోకి రాగానే తన మాటను నిలబెట్టుకున్నారు. ప్రభుత్వానికి బాక్సైట్ తవ్వకాలతో వచ్చే వేలాది కోట్ల రూపాయల ఆదాయం కన్నా గిరిజనుల ప్రయోజనాలకే జగన్‌మోహన్ రెడ్డి ప్రాధాన్యం ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన బాక్సైట్ జీవో 97ను రద్దుచేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని గిరిజనులకు స్వేచ్ఛా వాతావరణ కల్పించారు. గిరిజనుల గుండెల్లో చెరగని ముద్రవేసుకున్నారు.ఎనిమిదేళ్ల తరువాత సీఎం హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి రెండవసారి చింతపల్లి వస్తుండడంతో అన్ని వర్గాల గిరిజనుల ఆత్మీయ స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారు.

పరిశ్రమల స్థాపనకు దరఖాస్తుల స్వీకరణ

కొయ్యూరు: ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంలో పరిశ్రమల స్థాపనకు ఈనెల 23న దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఏపీ ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమలు నెలకొల్పే నిరుద్యోగ యువతీ యువకులకు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.